హోంమంత్రిని కలిసిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-పాలకొండ

రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనితను పాలకొండ టిడిపి శ్రేణులు గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మీకు ఎటువంటి అవసరమున్నా తాను ఉన్నాను అని హెూంమంత్రి హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. హోంమంత్రిని కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తేజోవతి, తెలుగు యువత మండల నాయకులు జాడ శ్రీధర్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇదేం మద్దతు..?

ఒక వైపు ఎరువులు, విత్తనాలపై రాయితీని కేంద్ర ప్రభుత్వం క్రమేణా ఎత్తేస్తోంది. మరోవైపు పెట్రోల్ రేటు ఎప్పుడో సెంచరీ కొట్టేసింది. డీజిల్ ధర నేడో, రేపో ఆ మార్కు చేరుకోనుంది. పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలూ పెరిగాయి. ఇలా రైతులపై పలు రూపాల్లో భారం మోపుతున్న కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పంటల మద్దతుధర పెంపు విషయానికి వచ్చేసరికి చేయి విదల్చడం లేదు. వరికి క్వింటాకు రూ.117 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గతేడాది రూ.143 పెంచగా, ఈసారి రూ.26 కోత పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట ఖర్చులు పెరిగిన నేపథ్యంలో మద్దతుధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర నిరాశకు గురి చేసింది.

ఐదేళ్లలో కేంద్రం పెంచిన మద్దతు ధర వివరాలు

సంవత్సరం	పెంపు (రూ.లో)	సాధారణ రకం వరి క్వింటాకు (రూ.లో)
2020-21	53	1868
2021-22	72	1940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300

- వరికి క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంపు
- గతేడాది పోలిస్తే రూ.26 తక్కువ
- పెరిగిన వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలు
- తడిసిమోపడవుతున్న పంట ఖర్చులు
- కేంద్రం మద్దతు ధరపై అన్నదాతల పెదవివిరుపు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు లక్షా 75వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. దాదాపు 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతుల సొంత అవసరాలకు పోనూ సుమారు రెండు లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాకు రూ.143 పెంచడంతో సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 పెరిగింది. ప్రస్తుతం రూ.117 పెంచడంతో సాధారణ రకానికి రూ.2300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇది ఏ మూలకు సరిపోతుందని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పంట ఖర్చులు

గతేడాదితో పోలిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు దుక్కులకు రూ.6.500 ఉంటే, ప్రస్తుతం రూ.ఏడు వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెప్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.2,500 ఖర్చు చేయగా, ప్రస్తుత సంవత్సరంలో రూ.మూడు వేల వరకు పెరిగింది. ఉబాల కోసం గత ఖరీఫ్‌లో రూ.7,500 వేలు ఖర్చు చేయగా, ఇప్పుడు రూ.ఎనిమిది వేలు దాటుతుందని రైతులు చెప్తున్నారు. పరేరా కంపెనీకి చెందిన గులికలు గతేడాది రూ.2,200 ఉండగా, ప్రస్తుతం రూ.2,400 చేరింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110.75 ఉండగా, డీజిల్ రూ.98.45 ఉంది. గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయి. వర్షాలు కురిస్తే ఈ ఖర్చులూ ఉంటాయి. గతేడాది మాదిరి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైతే, ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించే ఇంజిన్ల అద్దె పెరిగే అవకాశాలూ లేకపోలేదు. కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ల అద్దెలూ పెరగనున్నాయి. రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. మొత్తమ్మీద ఈ ఏడాది అదనంగా రూ.ఐదు వేలు ఖర్చవుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

సంతృప్తికరంగా లేదు

కేంద్ర ప్రభుత్వం చాలా నామమాత్రంగానే మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలు ప్రతి ఏటా 30 నుంచి 40 శాతం పెరుగుతున్నాయి. మద్దతుధర పెంచామని చెప్పుకోవడానికే కేంద్రం పెంచిందే తప్ప రైతులకు ఇది ఏమాత్రమూ గిట్టుబాటు కాదు. సాధారణ రకానికి క్వింటాకు రూ.2,800, గ్రేడ్-ఎకు రూ.3వేలు మద్దతు ధర ప్రకటించాలి. లేకుంటే భవిష్యత్తులో రైతులతో కలిసి ఆందోళన సన్నద్ధమవుతాం.

-రెడ్డి లక్ష్మునాయుడు,
జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

సమయపాలన పాటించకపోతే చర్యలు

ప్రజాశకిత - సాలూరు

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హెచ్చరించారు. గురువారం ఆమె స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.30గంటలు దాటినా కమిషనర్‌తో సహా ఉద్యోగులెవ రూ కార్యాలయంలో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె కార్యాలయానికి చేరిన కొద్దిసేపటికి కమిషనర్ ప్రేమప్రసన్నవాణి చేరుకున్నారు. కమిషనరే సమయానికి విధులకు రాకపోతే మిగిలిన సిబ్బంది ఎలా హాజరవుతారని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. పట్టణంలోని నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు ఎంతవరకు వచ్చాయని మంత్రి సంధ్యారాణి కమిషనర్‌ను ప్రశ్నించారు. తాను ఆదేశించి ఐదు రోజులైనా ఇంతవరకు పనులు ఎందుకు ప్రారంభించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులకు అంచనా వేసినట్లు కమిషనర్ చెప్పారు. కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా వున్నాయని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వా లని సంధ్యారాణి కమిషనర్‌ను ఆదేశించారు.

బాలికల కళాశాలగా ఉన్నత పాఠశాల

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను బాలికల కళాశాలగా మార్చ నున్నట్లు మంత్రి సంధ్యారాణి చెప్పారు. తొలుత ఆమె ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం జ్యోతి, ఎంఇఒ రాజ్ కుమార్‌తో మాట్లాడారు. ఉన్నతపాఠశాలను కళాశాలగా మార్చడానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు కళాశాల చేయాలని కొందరు విద్యార్థినులు కోరారని చెప్పారు. అది ఈరోజు త్వరలో కార్యరూపం దాల్చబోతున్నదని చెప్పారు. పాఠశాలకు విశాలమైన స్థలం వున్నందున గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు కొంత స్థలం కేటాయించాలని సూచించారు. ఆమె వెంట పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు కూనిశెట్టి భీమారావు, ముఖీ సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, కౌన్సిలర్లు తర్లాడ లక్ష్మోజీ, వైదేహి కృష్ణ, మాజీ కౌన్సిలర్ అల్లు అప్పయ్యమ్మ వున్నారు.

మున్సిపల్ కమిషనర్ పై మంత్రి సంధ్యారాణి ఫైర్

మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

మంత్రి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోలక

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి ఆమె నివాసంలో గురువారం కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిఒ 3కి చట్టబద్ధత కల్పిస్తూ గిరిజన ప్రాంతంలో వందశాతం ఉద్యోగాలు గిరిజనులకే చెందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిడిఎలో ప్రత్యేక డిఎస్‌సి, నాన్‌షెడ్యూల్ గ్రామాలుగా ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా మార్చాలని, జిసిసికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి ఆ సంస్థ ద్వార గిరిజనులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి తోడ్పాటు అందించేందుకు జీడి పిక్కల ప్రోసెసింగ్ యూనిట్లు స్థాపించాలని కోరారు. ఆయనతో ఆదివాసీ హక్కులు పరిరక్షణ వేదిక సభ్యులు జానకీరావు, సీతయ్య ఉన్నారు.

రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి : జిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ హామీ ఇచ్చారు. గురువారం ఉదయం పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా స్టేషన్ అభివృద్ధి చెందిందన్నారు. లిఫ్టులతో కూడిన ఎస్ఒబి అందుబాటులో తీసుకొస్తామన్నారు. స్టేషన్‌కు రెండు వైపులా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు తాత... నేడు మనుమరాలు

తొలిసారి అసెంబ్లీకి జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీ పురం ఏజెన్సీ ప్రాంతం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన గిరిజన మహిళ తోయక జగదీశ్వరి అడుగుపెట్టనున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ నుంచి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అసెంబ్లీలో అడుగు పెట్టడం ఇదే తొలిసారి. ప్రస్తుత ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముత్తాత అడ్డాకుల లక్ష్మణనాయుడు 1962లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. సిపిఐ అభ్యర్థి బి.శ్రీరాములపై 2,227 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. ఆనాటి వారసత్వం కుటుంబ రాజకీయాల్లో సర్పంచులు, ఎంపిటిసిలుగా కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం అదే కుటుంబం నుంచి జగదీశ్వరి గిరిజనుల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పుష్ప శ్రీవాణిపై ఎమ్మెల్యేగా గెలుపొందారు. అసెంబ్లీలో తొలిసారిగా అడుగుపెడుతున్న జగదీశ్వరి కురుపాం నియోజకవర్గంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావించే అవకాశం ఉంది. ఈ ప్రాంతం నుంచి ఆదివాసీ బిడ్డ అసెంబ్లీకి వెళ్లడం పట్ల గిరిజనులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో పాఠశాల

ప్రజాశక్తి - కురుపాం

పెచ్చులూడుతున్న స్కూల్ భవనం
బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు

నిరుపేద గిరిజన విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో గిరిజన గ్రామాల్లో పక్కా భవనాలు ఏర్పాటు చేసి వారికి విద్యను అందిస్తున్న ప్రభుత్వ ఆశయం గొప్పదే అయినప్పటికీ పాలకుల నిర్లక్ష్యమో, అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ ఆ భవనాలు సమస్యలకు నిలయంగా మారాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గొటివాడ పంచాయతీ బల్లుకోట గిరిజన గ్రామంలో సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు 23 మంది విద్యార్థులు చదువుతుండగా ఒకే గది విద్యను అభ్యసిస్తూ వరండాలో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. వరండా, తరగతిగది శ్లాబ్‌లో పెచ్చులూడి పడిపోతున్నాయి. ఏ సమయంలో ఎక్కడ పెచ్చులు మీదపడతాయోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం శ్లాబ్ నుంచి నీరు కారుతూ తరగతి గదుల్లో నీళ్ల నిల్వ ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి'తో గ్రామస్తులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించామని, అయినా ఫలితం లేదని అన్నారు. దీంతో విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వంలో హయాంలోనైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నామన్నారు.

రాలిపోతున్న శ్లాబ్ పెచ్చులు

నీట్ పరీక్ష నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి బాలాజీ జంక్షన్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలాజీ జంక్షన్ వద్ద మానవహారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. ఇదిలా వుంటే మొదటి సారి జూన్ 14న ఫలితాలు విడుదల చేస్తామని ప్రకటించి, ఎన్నికల కౌంటింగ్ రోజున (జూన్ 4) పరీక్షా ఫలితాలు విడుదల చేయటంతో ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నిటిపైనా విచారణ జరిపించాలని, పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందినందుకు ఈ ఏజెన్సీ ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జె రవి, ఉపాధ్యక్షులు సమీరా, నాయకులు రమేష్, సోమేశ్, గుణ రాజు, భారతి, వెంకటరమణ, దుర్గాప్రసాద్, అక్షయ్, వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం

ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పాలిథిన్ వాడితే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

కిరాణా, కూరగాయలు, తదితర దుకాణాల్లో పాలిథిన్ కవర్లు వాడితే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలో కూరగాయాల మార్కెట్‌లో పలు దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాలిథిన్ కవర్లు కలిగిన ఓ దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత పాలకొండకు అందరూ సహకరించాలన్నారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ విధిగా చేతి సంచిని తెచ్చుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల్లో అశ్రద్ధ వద్దని పారిశుధ్య కార్మికులకు సూచించారు. వీధులను, రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం వీధుల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన పర్యవేక్షించారు.

ఘనంగా రెవెన్యూ డే వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా రెవెన్యూ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు మాట్లాడుతూ ముందుగా రెవెన్యూ సిబ్బందికి రెవెన్యూ డే శుభాకాంక్షలు తెలియజేసారు. రెవిన్యూ శాఖలో పనిచేయడమనేది గర్వపడాల్సిన విషయన్నారు. రెవెన్యూ శాఖ అనేది ఒక వ్యవస్థ అని, ఈ శాఖలో ఎక్కువ మొత్తంలో నవీకరణ విషయాలుంటాయని, ఎప్పటికి అప్పుడు ఉద్యోగులు అప్డేట్ కావాల్సిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు. తెలియని విషయాలు నేర్చుకోవడంలో చిన్న, పెద్ద ఉద్యోగి అనే భావన ఉండకూడదని అన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, ఇలా తదితర అంశాల్లో రెవెన్యూ శాఖ ప్రాముఖ్యత చాలా ఉంటుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని, ఆ బోర్డు ఏర్పాటైన జూన్ 20న రెవెన్యూ డే చేసుకోవడం జరుగుతోందనిచెప్పారు. ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని నేర్చుకుంటే గుర్తింపు ఉంటుందని, శాఖకు సంబంధించిన ప్రతి విషయాన్ని క్షుణంగా నేర్చుకోవాలని అన్నారు. శాఖకు ఉన్నట్టువంటి సామర్థ్యం, శక్తిని ప్రజలకు ఉపయోగపడేలాఉండాలని, ప్రజలకు రెవెన్యూ శాఖపై నమ్మకం ఉండాలని అన్నారు. రెవెన్యూ శాఖపై ఉన్నట్టువంటి ప్రక్షాళన తొలిగించి, రెవెన్యూ శాఖను ఉన్నతి స్థితి, అభివృద్ధికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. సమావేశం పాల్గొన్న రెవెన్యూ అధికారులు, విశ్రాంతి రెవెన్యూ అధికారులు, సిబ్బంది అనుభవాలను, వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒవేణుగోపాలరావు, ఈ, ఎఫ్, జి -సెక్షన్ సూపరింటెండెంట్ చిన్నకృష్ణ, డి -సెక్షన్ సూపరింటెండెంట్ అవాల సూర్యనారాయణ, డిటి చంద్రమౌళి, షేక్ ఇబ్రహీం, విఆర్ఒ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సింహాచలం, విశ్రాంతి రెవెన్యూ అధికారులు మనోరాబాయ్, సత్యనారాయణ, కామేశ్వరరావు, అప్పలనాయుడు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడంలో రెవెన్యూ ఉద్యోగులు కీలకం: ఆర్డీవో

పాలకొండ : ప్రజలకు సేవలందించడంలో రెవెన్యూశాఖ ఉద్యోగులదే కీలకపాత్ర అని ఆర్‌డిఒ వివి రమణ అన్నారు. రెవెన్యుడే సందర్భంగా గురువారం తుమరాడలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ శాఖ ద్వారా అమలవుతున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన డిప్యూటీ తహశీల్దార్ బుచ్చయ్యను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వరహాలు, మండల సర్వేయర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ కేశవనాయుడు

సీతానగరం : రెవెన్యూ డే వేడుకలు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాస్ ముందుగా రెవెన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఉన్నతికి, అభివృద్ధికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు కుమార్, సాంబ, శ్రీదేవి, సునీల్, ఉదయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని గోయిదిలో రెవెన్యూ దినోత్సవం తహశీల్దార్ మహేశ్వర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రెవెన్యూ సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఐటిడిపి నియోజకవర్గం కోఆర్డినేటర్ ఇమరక పవన్, పలువురు ఎంపిటిసి సభ్యులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : రెవెన్యూ డే సందర్భంగా ఆ శాఖ ద్వారా ప్రజాప్రయోజనాలు, రెవెన్యూ డిపార్ట్మెంట్ పనితీరు, దాని విశిష్టత మొదలై అంశాలపై గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సీతారామయ్య వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, జియ్యమ్మవలస గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని చెరువులు, బందల్లో నిర్మించిన అనధికార కట్టడాలను తక్షణమే తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలో గల దేవునిబంధం, బిల్ల బంధలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమణ దారులపై వెంటనే చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆదేశించారు. సర్వే నెంబర్లతో పాటు ఆక్రమణలపై వివరాలు సేకరించి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఇకపై చెరువులను, బందలను ఆక్రమించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆదేశించిన రెండు గంటల లోపే అక్రమ నిర్మాణాలపై చర్యలు

పట్టణంలోని ఎస్ఎన్ మూర్తినగర్‌లో ఉన్న దేవునిబంద, బిల్ల బందను ఆక్రమణలను పరిశీలించిన ఎమ్మెల్యే విజయచంద్ర దేవునిబందలో గల అక్రమ లేఔట్‌ను, అనధికార నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశించిన రెండు గంటల వ్యవధిలోనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్థానికుల పోలీస్‌ల పర్యవేక్షణలో జెసిబి సాయంతో అనధికార నిర్మాణాన్ని తొలగించారు. దీంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వేసిన లేఔట్‌లో సర్వేరాళ్లను తొలగించడంతో స్థానికులు ఎమ్మెల్యే పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో అక్రమ, అనధికార కట్టడాల కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఎమ్మెల్యే చర్యలు అభినందనీయం

ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంరూరల్ : స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు ఆదర్శంగా తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడతో పాటు పశు పక్ష్యాదులు, జలజీవరాసుల ఉనికికి ఆధారభూతమైన చెరువులు, గెడ్డలు పార్వతీపురంలో కబ్జాకు గురైన విషయమై వాటిని రక్షిస్తానని ఎన్నికల ముందు ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గత రెండు రోజులుగా వరహాల గెడ్డ, బిళ్లబంద, దేవుడి బంధ తదితర ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పర్యటించి ఆక్రమణలు తొలగించడం అభినందనీయమన్నారు. ఎన్నికైన వెంటనే ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చే ఎమ్మెల్యే అభినందినీయులన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి రాష్ట అధ్యక్షులు జాగారపు ఈశ్వర్ ప్రసాద్, కార్యదర్శి రఘు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్‌డిఒ హేమలత

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఆర్‌డిఒ హేమలత గురువారం బహూకరించారు. కొమరాడలోని కెజిబి విద్యాలయానికి "మై స్కూల్ మై ప్రైడ్" ప్రోగ్రాంలో భాగంగా ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్ఫూర్తిని నింపుతూ ప్రశంసా పత్రాలను బహూకరించారు. బహుమతులను అందుకున్న వారిలో హిమరిక మానస, తెలికి లావణ్య, బొజ్జ రాధిక, రాయగడ హేమలత, బిడ్డిక చిన్నారి ఉన్నారు. విద్యార్థులు ఇలాగే చదువుతూ ఉన్నత చదువులు, హోదాలు అందుకోవాలని ఆర్‌డిఒ ఆకాంక్షించారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పదో వార్డును గురువారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర పర్యటించారు. ఆ వార్డులో పారిశుధ్య సమస్యలు తాండవిస్తున్నాయి. కాలువల్లో మురుగనీరు పేరుకుపోయి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు రహదారు లేక నానా అవస్థలు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు, ఎమ్మెల్యే విజయచంద్ర హుటాహుటిన వార్డులో పర్యటించి వార్డు సమస్యలు పరిశీలించి, మున్సిపల్ ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళితో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో పారిశుధ్య నిర్వహణ పనులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల, సీతారాం, పత్తిగిల్లి సత్యనారాయణ, కోల మధుసూదరావు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి మార్పుపై హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ప్రవీణ్‌ప్రకాష్‌ను తొలగించి కోన శశిధర్ నియామకం పట్ల జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అలాగే పిఆర్‌టియు రాష్ట్ర నిర్వహణ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. గతంలో విద్యాశాఖ కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్‌ప్రకాష్ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను, ఉపాధ్యాయ, విద్యాశాఖ అధికారుల ఔన్నత్యాన్ని దిగజార్చేలా ప్రవర్తించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని అన్నారు. కనుక ఈ విద్యా సంవత్సరం ఆరంభంలోనే ప్రవీణ్ ప్రకాష్‌ను తొలగించి సమర్థుడైన ముఖ్య కార్యదర్శి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలో గల అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలను సంబంధిత గ్రామ సచివాలయాల ఎఎన్‌ఎంలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక చింతలగూడ వీధిలో గల ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలను నిర్వహించారు. విద్యార్థుల్లో ఎంత మేరకు రక్తం శాతం ఉందో తెలుసుకునేందుకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సచివాలయ ఎఎన్‌ఎం అలేఖ్య తెలిపారు. విద్యార్థుల్లో రక్తహీనత అధికంగా ఉంటే ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పౌష్టికాహారంతో కూడుకున్న ఆహార పదార్థాలను విద్యార్థులకు ప్రతిరోజు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ డబ్ల్యూ భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, వాలంటీర్లు సునీత, ప్రశాంతి ఉన్నారు.

సవర భాషా వాలంటీర్లను కొనసాగించేందుకు కృషి

ప్రజాశక్తి - సీతంపేట

సవరభాషా వాలంటీర్లను కొనసాగించేందుకు కృషి చేస్తానని టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో భూదేవిని కలిసి భాషా వాలంటీర్లు వినతిని అందజేశారు. గత 20 ఏళ్లుగా ఐటిడిఎ పరిధిలో 155 ఎంటిబి-ఎంఎల్‌బి సవర భాషా వాలంటీర్లుగా వివిధ పాఠశాలల్లో పనిచేశామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమను విధుల నుంచి తొలగించారని వాపోయారు. ఈ విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసి కొనసాగించాలని, గౌరవవేతనం పెంచాలని కోరారు. దీనికి భూదేవి మాట్లాడుతూ మాతృభాష వాలంటీర్ల సమస్యను గిరిజన, విద్యాశాఖా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి సవర డోంబు, వాలంటీర్లు సవర ఆనందరావు, అరిక నాగభూషన్, ఎ.రాణి, వి.లక్ష్మి, వి.సుహాసిని, పి.సుందరరావు, ఎ. సవరాజు, జిల్లా అధ్యక్షులు సవర ఎల్లంగో, సవర అనిల్ కుమార్, సవర శివశంకర్, సవర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎస్ సొసైటీ ప్రతినిధులు

స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, శివన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ గురువారం స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో స్టడీ మెటీరియల్, డ్రాయింగ్ కిట్లు అందించామని, ఈ మెటీరియల్ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపయోగపడుతుందని అన్నారు. కావున విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎస్.సొసైటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామ గోవిందం, ఉపాధ్యాయులు మల్లిపురం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లి చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నెల్లిచెరువు గట్టుపై నిర్మించిన కట్టడాలను చూపుతున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని బెలగాంలో గల నెల్లిచెరువులో గత ప్రభుత్వ హయాంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడా బాబులపై చర్యలు చేపట్టాలని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, సూరిబాబు డిమాండ్ చేశారు. గురువారం వారు నెల్లిచెరువులో పెత్తందార్లు నిర్మిస్తున్న భారీ గృహ సముదాయాలను, పక్కా ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా నెల్లిచెరువులో పేదలు పాకలు, రేకు ఇళ్లు కట్టుకొని జీవనం సాగిస్తూ పట్టణంలో రోజు కూలి పనులు చేసుకుని జీవిస్తుంటే అటు మున్సిపల్, ఇటు రెవెన్యూ అధికారులు పేదలపై జులుం ప్రదర్శించి, బలవంతంగా పాకలు పీకేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పట్టణానికి దూరంగా స్థలాలు ఇస్తామని మాయమాటలు చెబుతున్నారని, కానీ గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా మాజీ ఎమ్మెల్యే అండదండలతో కొంతమంది పెద్దలు, ప్రభుత్వ ఉద్యోగులు, పెత్తందారులు పక్కా ఇళ్లు, అతి పెద్ద గృహ సముదాయాలు నిర్మిస్తున్నా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కానీ, ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా నెల్లిచెరువు మొత్తాన్ని సర్వే చేసి ఎవరైతే అర్హత ఉన్న పేదలు ఉన్నారో వాళ్లందరికీ పట్టాలిచ్చి రెగ్యులర్ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. అర్హత లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, పెత్తందారులు, భూస్వాములు కట్టుకున్న పక్కా నిర్మాణాలను తొలగించి పేదలకు న్యాయం చేయాలని లేకపోతే రానున్న కాలంలో పట్టణంలో మురికివాడల్లో నివసిస్తున్న పేదలందర్నీ కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. ఈ సమస్యపై ప్రస్తుత ఎమ్మెల్యే విజయచంద్ర దృష్టి సారించి పేదలకు పట్టాలు ఇప్పించి పక్కా ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అక్రమంగా నిర్మించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంతర్జాతీయ యోగా దినోత్సవంను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యులు డాక్టర్ బి సుశీల తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి8 గంటల వరకు స్థానిక ఎపి ఎన్‌జిఒ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, యోగా క్లబ్‌లు, విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. యోగా దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

వికలాంగుల పెన్షన్ పెంపుపై హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వికలాంగుల పెన్షన్ పెంపుపై వికలాంగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కందిశ రమేష్, చందాపు గంగయ్య, కోశాధికారి సురేష్ కలిసి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పింఛను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని సంతోషించి వికలాంగులకు అండగా ఉన్నందుకు భవిష్యత్తులో మరింత భరోసా మాకు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఎవర్నీ డిప్యుటేషన్‌పై తీసుకోలేదు

ప్రజాశక్తి కథనంపై డిఎంహెచ్‌ఒ స్పందన

ప్రజాశక్తి - మక్కువ

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి తాము ఎవర్నీ డిప్యూటేషన్‌పై తమ ఆఫీసుకు తీసుకురాలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి విజయపార్వతి తెలిపారు. ఈనెల 11న పైరవీలు చేసుకో... పనులు తప్పించుకో అన్న ప్రజాశక్తి వార్తకు ఆమె స్పందించారు. మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఓ సూపర్వైజర్‌ను డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు కథనం వచ్చిన అంశంపై ఆమె స్పందించారు. సూపర్‌వైజర్‌ను వెంటనే విధుల్లోకి వెళ్లాలని ఆదేశించామని తెలిపారు.

ఇదిలా ఉండగా సూపర్వైజర్ డిప్యూటేషన్ వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానిక వైద్యాధికారికి ఉన్నతాధికారులు ఓరల్ డిప్యూటేషన్ అని ఆదేశాలు ఇచ్చారని, అలాగే డ్యూటీ సర్టిఫికెట్ కూడా ఇచ్చి జీతం కూడా వేయించుకున్నారన్న విషయం బహిర్గతమైంది. అయితే ఉన్నతాధికారులకు ఈ విషయం తెలియకపోవడం ఏమిటి అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతోంది. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఒక ప్రోగ్రాం ఆఫీసర్ ఈ డిప్యూటేషన్ వ్యవహారమంతా తన కనుసన్నల్లో నడిపిస్తూ జిల్లా ఉన్నతాధికారులకు తెలియకుండా ఉంచడం కొసమెరుపుగా చెప్పుకోవచ్చు. ఏది ఏమైనా పారదర్శకంగా దర్యాప్తు నిర్వహిస్తే విషయం తేటతెల్లం కానుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జంఝావతి పూర్తికి ఇదే మంచి అవకాశం

బ్యారేజీని సందర్శించిన కూటమి నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కూటమి నాయకులు

దశాబ్దల కాలంగా ఒడిశాతో ఉన్న వివాదం వల్ల నిలిచిపోయిన జంఝావతి జలాశయం నిర్మాణం పూర్తికి ఇదే మంచి అవకాశమని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు అన్నారు. గురువారం జంఝావతి జలాశయాన్ని ఎన్‌డిఎ నాయకులు సందర్శించారు. ముందుగా జంఝావతి ప్రాజెక్టు ప్రధాన కాలువలు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు డి.వెంకట నాయుడు, బిజెపి మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ జంఝావతి జలాశయం నిర్మాణానికి ఒడిశాతో ఉన్న వివాదం పరిష్కారానికి మంచి అవకాశం వచ్చిందన్నారు. భవిష్యత్తులో ఈ జలాశయం సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులు కలుపుకొని సమస్యను వారి దృష్టిలో పెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని మాట్లాడారు. ప్రస్తుతం ఒడిశాలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో పాటు ఆంధ్రాలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున జంఝావతి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఒడిశా ప్రాంతంలో 1100 ఎకరాల భూమి ముంపునకు గురైన నేపథ్యంలో అప్పటి ఒడిశా ప్రభుత్వం అంగీకరించకపోవడంతో జలాశయం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం మన్యం జిల్లాలోని నాలుగురు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలను కలిసి జంఝావతి ప్రాజెక్టు సమస్యను వారి దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేలు మంత్రులు ద్వారా అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించి అవసరమైన నిధులు మంజూరుకు ముఖ్యమంత్రిని, ఉపముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని నాయకులు తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేందుకు జంఝావతి సాధన సమితి అని కమిటీని ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మూడు నియోజకవర్గాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మన్యం జిల్లాలోనే పెద్ద సమస్యగా ఉన్న ఈ ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దష్టి తీసుకువెళ్లి పరిష్కరిస్తే ఈ ప్రాంత రైతులు సస్య శ్యామలంగా రెండు పంటలు పండించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. త్వరలో ఈ సమస్యను ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రాజెక్టు నిర్మాణానికి ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గులిపల్లి సుదర్శన్ రావు, నంగి రెడ్డి మధుసూదన్‌రావు, గంగరేగు వలస ఎంపిటిసి గంట వెంకటనాయుడు, పడాల హరిప్రసాద్, మరడాన తిరుపతి నాయుడు, బిజెపి నాయకులు ద్వారపురెడ్డి సురేష్ కుమార్, సొండి సంజీవనాయుడు, జనసేన పార్టీ నాయకులు గార గౌరీ శంకర్, మూడు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలు క్షేత్రస్థాయిలో జరపాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డిఎంఒ జగన్మోహన్‌రావు

గ్రామాల్లో జ్వర లక్షణాలు గుర్తించిన ప్రతి ఒక్కరికీ సత్వరమే నిర్ధారణ పరీక్షలు క్షేత్ర స్థాయిలోనే జరపాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు ఆదేశించారు. మండలంలోని చినఖేర్జలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన మలేరియా ఆర్‌డిటి నిర్ధారణ పరీక్షలు, ఫలితాలను పరిశీలించారు. ఫలితాలు నెగెటివ్‌గా నిర్ధారణ అయిన వారికి ఆరోగ్య సమస్యలకు తగు మందులు అందజేయాలన్నారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను డిఎంఒ తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని, సరైన గుర్తింపు లేని వైద్యాన్ని ఆశ్రయించొద్దని స్థానికులకు సూచించారు. జ్వర లక్షణాలున్న వారికి సేకరించిన రక్త పూతలు(స్లైడ్స్) సకాలంలో ల్యాబ్‌లో పరీక్షలు జరగాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మలేరియాగా గుర్తిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. గ్రామంలో తాగునీరు స్వచ్ఛత పరీక్షలు ఎప్పటికప్పుడు జరపాలన్నారు. దోమల లార్వా స్థావరాలు ఎక్కడైనా ఉన్నాయా అని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు, జాగ్రత్తల పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ విజయకుమారి, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది అనిల్, మంగమ్మ, రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అగ్రిగోల్డ్ బాధితుల అభినందనలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎమ్మెల్యేగా గెలుపొందిన బోనెల విజయ్‌చంద్రను ఆయన కార్యాలయంలో అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇవి నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్వీస్ కుమార్, నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించుకొని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ఇక రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని సాధ్యమైనంత త్వరగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టినందుకు కూటమికి ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు, నాయకులు ఎల్లంకి శ్రీనివాసరావు, బాసిగాన వెంకటరమణ (చిరు), ఎం.శ్రీరాములు, ఎస్.గౌరీశంకర్రావు, తులసి మాస్టార్, ఇజ్జురోతు శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతానగరం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా సరఫరా ఉండదని ఆ శాఖ అధికారి ఒక ప్రకటన తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేయబడతాయని, దీన్ని విద్యుత్ వినియోగదారులు అర్థం చేసుకోవాలని కోరారు.

121 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు అలేఖ్య

మండలంలోని వండువ జంక్షన్ వద్ద గల సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నేత్ర వైద్యాధికారి ఎస్.అలేఖ్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 121 మందికి నేత్ర వైద్య తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా 78 మందిని శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసి ఆపరేషన్ కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం దూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం, క్యాంపు ఇన్చార్జి సిహెచ్ వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను అడ్డుకోవడం అన్యాయం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన గ్రామాలకు వేస్తున్న రోడ్లను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం అన్యాయమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తున్న సమయంలో అటవీశాఖాధికారులు అడ్డుకోవడంపై గిరిజనులతో కలిసి గురువారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మారుమూల గిరిజన పంచాయతీలైన పూడేసు, మసిమండ, పెద్దశాఖ, కుంతేసు పంచాయతీ మీదగా లంజ గ్రామానికి వెళ్లే ఈ రహదారి మార్గంలో 2006 లో ఇటు ఐటిడిఎ, అటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు తారు రోడ్డు వేశారని తెలిపారు. ఇప్పుడు తారురోడ్డు వేస్తుండగా అటవీశాఖ అధికారులు బుధవారం వెళ్లి ఈ రహదారికి అనుమతులు లేవంటూ నిలిపివేయడం అన్యాయమని అన్నారు. ఇప్పటికే పైన తెలిపిన గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. వైద్యం కూడా అందక అనేకమంది మరణించిన పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో రోడ్డు పనులను నిలిపివేయడం ఎంత వరకు సబబుని ప్రశ్నించారు. ఇప్పటికైనా అటవీశాఖాధి కారులు స్పందించి రోడ్డు పనులను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శివుని నాయుడు గిరిజన యువకులు ముసిరి కామేశ్వర రావు, శంకరరావు, మల్లన్న, సురేష్ పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్ ఆపరేటర్లు హర్షం

ప్రజాశక్తి -సాలూరురూరల్

ఫీసర్ అంబులెన్స్‌లను మళ్లీ ప్రవేశపెడతామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హామీ ఇవ్వడంతో ఫీడర్ అంబులెన్స్ ఆపరేటర్లు హర్షం వ్యక్తం చేశారు. గిరిశిఖర గ్రామాల్లో ఉండే రోగులను మైదాన ప్రాంతంలోనే ఆసుపత్రులకు తీసుకురాడానికి ఈ అంబులెన్స్‌లను ప్రధాన సాధనంగా గత టిడిపి హయాంలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వీటిని పూర్తిగా విస్మరించింది. అంతేకాక వీటి మరమ్మతులకు, పెట్రోల్‌కు కూడా డబ్బులు ఇవ్వకపోవడం, ఆపరేటర్లకు చాలీచాలని జీతాలు అప్పుడప్పుడు ఇస్తుండేవారు. దీంతో తాము ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా స్పందన కరువైంది. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడం, అందులోనూ సాలూరు నియోజకవర్గంలో గిరిశిఖర గ్రామాలు ఎక్కువగా ఉండడం ఈ ప్రాంతానికే గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మడి సంధ్యారాణి కావడంతో మళ్లీ ఫీడర్ అంబులెన్స్‌లో ప్రవేశపెడతామని చెప్పడం హర్షణీయమని వారు తెలిపారు.

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వైసిపి రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ ఓడిపోయినప్పటికీ ఎన్నికల్లో జోగారావు పోరాట స్ఫూర్తిని మెచ్చుకొని భవిష్యత్తులో ప్రజల తరపున మరిన్ని పోరాటాలు చేయాలని కోరారు.

గిరిజన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులకు తాడికొండ పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యుగంధర్ ఉన్నారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను ఐటిడిఎ ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు అందచేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు చక్కగా వినియోగించుకొని చక్కగా చదువు కోవాలని ఆకాంక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎవి శ్రీనివాసరావు, వార్డెన్ వీరేసు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మలేరియా మందులు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంత ఆసుపత్రుల్లో మలేరియాతో సహా అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్‌కు వినతిని అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భద్రగిరి సిహెచ్‌సిలో మలేరియా వైద్యం కోసం వెళ్లిన గిరిజన విద్యార్థులకు మందుల్లేవని వైద్య సిబ్బంది చెప్పడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అలాగే గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ అయిన సిఆర్‌టిల్లో పురుష ఉపాధ్యాయులు 16 మందిని బాలికల పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నియమించారని తెలిపారు. ఈ నియామకాలను రద్దు చేసి బాలికల పాఠశాలల్లో మహిళా టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

పెద్దూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి పెద్దూరులో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

ఫైర్‌మేన్ ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో ఫైర్‌మాన్‌గా విధులు నిర్వహిస్తున్న గుడిమెట్ల కిషోర్ (34) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై ఎం.రాజేష్ అందించిన వివరాలు ప్రకారం మండలంలో చినభోగిలికి చెందిన కిషోర్ తన భార్యతో ఉన్న తగాదాలు, మద్యం మానలేక ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కిశోర్ భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పుస్తెలతాడు, నగదు చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని 35 గ్రాముల పుస్తెలతాడుతో పాటు రూ.39,500 నగదు చోరీకి గురైంది. ఎస్సై ఎం.రాజేష్ అందించిన వివరాల ప్రకారం మండలంలోని జోగింపేటలో సర్పంచ్ కళ్యాంపూడి సింహాచలం తన కుటుంబంతో కలిసి ఆరుబయట పడుకొన్నారు. గురువారం ఉదయం ఇంటి వెనక నుండి నిచ్చెన వేసి ఉండడం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా పరుపు కింద పెట్టిన పుస్తువులతాడు, బీరువాలో ఉంచిన రూ.39,500 నగదు లేవని గమనించారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

ఎటువంటి అనుమతుల్లేకుండా ఇష్టానుసారంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూర్జ రేవులో ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకొని ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.